సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.381 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం నాటికి 8.381 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తరకాలువకు 100 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.73,750
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,587
3శాతం జీఎస్టీతో	రూ.6,785
సవర (8గ్రాములు)	రూ.54,280



బాబొస్తే జన్మభూమి కమిటీలదే రాజ్యం

వెంకటాచలం: టీడీపీకి ఓటేస్తే జన్మభూమి కమిటీలు రాజ్యమేలుతాయిని మంత్రి కాకాణి పేర్కొన్నారు.

8లో

వైఎస్సార్‌సీపీలోకి క్యూ

వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఆకర్షితులైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి క్యూ కడుతున్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని పేర్కొంటున్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

టీడీపీకి చెందిన 300 మంది చేరిక

ఆత్మకూరు: ఏఎస్‌పేట మండలానికి చెందిన షేక్ రంతుల్లా (జీబు రంతుల్లా), సందానీబాషా ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 300 మందికిపైగా వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం ఆత్మకూరులోని వైఎస్సార్‌సీపీలో కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వారు కండువాలు కప్పుకున్నారు. ఏఎస్‌పేట జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, నాయకులు జనార్దన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, జీ భాస్కర్‌రెడ్డి, అంబటి కోటిరెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన తిక్కవరప్పాడు మిక్స్‌డ్‌కాలనీవాసులతో మంత్రి కాకాణి

తిక్కవరప్పాడులో 80 కుటుంబాల చేరిక

వెంకటాచలం: తిక్కవరప్పాడు పంచాయతీలో టీడీపీకి చెందిన 80 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిక్కవరప్పాడులో మంగళవారం పర్యటించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తామంతా లబ్ధి పొందామని, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని వారు తెలిపారు.



పార్టీలో చేరిన పెద్దపాళెం వాసులతో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

ప్రసన్నకు పెద్దపాళెంవాసుల మద్దతు

విడవలూరు: మండలంలోని పెద్దపాళెం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ మద్దతుదారులు ఆ పార్టీని వీడారు. ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఆకర్షితులైన మీనంగారి జాలయ్య, బుచ్చింగారి నాగులు, ముక్కోటి ప్రభాకర్, ముక్కోటి లక్ష్మయ్య, పామంజి కణకయ్య, అడాగారి బేబిరావు, తదితరులు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక నాయకులు కొండూరు శ్రీనివాసులు, మేకల పోలయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

30 వరకు పది సప్లిమెంటరీ ఫీజు గడువు

- మే 24 నుంచి పరీక్షలు

నెల్లూరు(అర్బన్): పదో తరగతిలో తప్పిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్వహించనున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 30లోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సబ్జెక్టుల్లోపు రూ.110, అంతకు మించిన సబ్జెక్టులకు రూ.125 ఫీజుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఫీజును సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మే 24న మొదటి లాంగ్వేజి, 25న రెండో లాంగ్వేజి, 27న ఇంగ్లిష్, 28న గణితం, 29న ఫిజికల్ సైన్స్, 30న బయాలాజికల్ సైన్సు, 31న సోషల్ స్టడీస్, జూన్ 1న మొదటి లాంగ్వేజ్ పేపర్-2, 3న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు జరుగుతాయని వివరించారు.

రూ.3,81,510 నగదు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడి చర్యల్లో భాగంగా పోలీసు, సెబ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో రూ.2 లక్షలు, సంతపేట పరిధిలో రూ. 1,16,510. దుత్తలూరులో రూ.65 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కావలి రూరల్‌లో 14, సైదాపురంలో 10, బిట్రగుంటలో 30, అల్లూరులో 13, కొండాపురంలో 38, కలిగిరిలో 11, జలదంకిలో 17, వీకేపాడులో 18, సంగంలో 10, కందుకూరు రూరల్‌లో 14, సెబ్ అధికారులు 158 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1050 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పెద్దలకూ టీబీ వ్యాక్సిన్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): క్షయ నిర్మూలనకు ఇప్పటి వరకు పుట్టిన పిల్లలకు మాత్రమే ఇస్తున్న టీబీ వ్యాక్సిన్‌ను తొలిసారిగా 18 ఏళ్లు నిండిన రిస్క్‌కు దగ్గరగా ఉన్న పెద్దలకు వేయనున్నట్లు డీఎంహెచ్ఓ పెంచలయ్య తెలిపారు. సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వైద్యులకు పెద్దలకు టీబీ వ్యాక్సినేషన్‌పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసి క్షయ రహిత సమాజానికి వైద్యులు కృషి చేయాలన్నారు. జిల్లా క్షయ నివారణాధికారి ఖాదర్‌వలి పాల్గొన్నారు.

అక్రమ మద్యం, నగదు కట్టడిపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్రమ మద్యం డంప్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు. జీఎస్టీ అధికారులు వ్యాపార లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, అదనపు ఎస్పీ సౌజన్య, జిల్లా రవాణా అధికారి చంద్ర, ఎక్సైజ్ శాఖ ఈఎస్‌కే నాగమల్లేశ్వరరెడ్డి, సెబ్ అధికారి బాబు శ్రీధర్, జీఎస్టీ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్, ఈవీఎం నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్, ఎల్‌డీఎం ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



- విక్రమ్‌ను ఎదుర్కొనేందుకు ఓటమి భయంతో ఒక్కటైన శత్రువులు
- అందులో నలుగురు మాజీ ఎమ్మెల్యేలు, ఒకరు ఎమ్మెల్యే ఆశావహుడు
- వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఆత్మకూరు
- వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య 16 శాతం ఓట్ల తేడా
- ప్యాకేజీలతో గెలవొచ్చనే భ్రమలో టీడీపీ
- వైఎస్సార్‌సీపీలోకి ఆగని వలసలు

వీరందరూ ఆగర్భ శత్రువులు..

వీరి మధ్య పచ్చగడ్డి వేస్తేనే భగ్గుమంటుంది..అలాంటిది ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఎదుర్కోలేక వారంతా ఒక్కటయ్యారు. విక్రమ్‌రెడ్డికి స్వయాన బాబాయైన చంద్రశేఖర్‌రెడ్డి.. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని కృష్ణయ్య, కొమ్మి లక్ష్మయ్యనాయుడు.. టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన గూటూరు కన్నబాబు ఇలా చేతులు కలపడంపై నియోజకవర్గంలో విస్మయం వ్యక్తమవుతోంది. టీడీపీ ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి కోసం వీరందరూ ఏకమైనా ఎలాంటి నష్టం లేదని, తమ ఓటు అభివృద్ధి ప్రదాత విక్రమ్‌రెడ్డికేనని ప్రజలు ముక్తకంఠంతో చెప్తున్నారు.



ఆత్మకూరులో పంచతంత్రం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు టీడీపీకి చెందిన ఆగర్భ శత్రువులంతా ఒక్కటయ్యారు. సోదరుడి ఆకస్మిక మరణంతో రాజకీయాల్లోకి వచ్చి అంచనాలకు మించిన మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికైన విక్రమ్‌రెడ్డి రెండున్నరేళ్లలోనే ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. ప్రస్తుత ఎన్నికల బరిలో విక్రమ్‌రెడ్డిపై టీడీపీకి చెందిన ఐదుగురు దండయాత్ర చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీకి కంచుకోట

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఆత్మకూరు ఆ పార్టీకి కంచుకోటగా ఉంది. గతంలో కాంగ్రెస్, ఇండిపెండెట్లు, టీడీపీ దోబూచులాటలాడినా..స్వల్ప మెజార్టీలతోనే గట్టెక్కాయి. ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గత రెండు ఎన్నికల్లో పోలైన ఓట్లలో సగటున 55 శాతం ఓట్ల షేర్‌ను దక్కించుకుంది. 2014లో తొలిసారిగా ఫ్యాన్ గుర్తుపై మేకపాటి గౌతమ్‌రెడ్డి 31,412 ఓట్ల ఆధిక్యంతో టీడీపీ అభ్యర్థి గూటూరు మురళీ కన్నబాబుపై గెలుపొందారు. ఆ ఎన్నికల్లో పోలైన ఓట్లలో వైఎస్సార్‌సీపీకి 55.98 శాతం వస్తే, టీడీపీకి కేవలం 36.08 శాతం ఓట్లు దక్కాయి. 2019 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ నుంచి బరిలోకి దిగిన గౌతమ్‌రెడ్డి టీడీపీ దిగ్గజం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యతో పోటీ పడ్డారు. బొల్లినేని సర్వశక్తులు ఒడ్డినా వైఎస్సార్‌సీపీనే మళ్లీ విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో పోలైన ఓట్లలో వైఎస్సార్‌సీపీకి 53.22 శాతం దక్కాయి. టీడీపీకి 40.44 శాతం ఓట్లు వచ్చాయి.

ఉపఎన్నికల్లో 74.47 శాతం ఓట్లు

మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆకస్మిక మృతితో జరిగిన ఉపఎన్నికల్లో ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్ రెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 74.47 శాతం వైఎస్సార్‌సీపీకే దక్కాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయకుండా బీజేపీ అభ్యర్థికి లోపాయికారిగా మద్దతు ఇచ్చింది. అయినా సార్వత్రిక ఎన్నికలతో పోల్చుకుంటే వైఎస్సార్‌సీపీ దాదాపు 20 శాతం అత్యధికంగా ఓట్లను కైవసం చేసుకుంది.



ఆత్మకూరును సస్యశ్యామలం చేసిన గౌతమ్, విక్రమ్

2019 ఎన్నికల్లో గెలుపొందిన మేకపాటి గౌతమ్‌రెడ్డి మంత్రిగా రెండున్నరేళ్లలోనే ఆత్మకూరు నియోజకవర్గంలో చెరగని ముద్ర వేశారు. అదే స్థాయిలో విక్రమ్‌రెడ్డి అభివృద్ధిని చేసి చూపించారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంను ఏర్పాటు చేసి సొంత నిధులతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో దాదాపు 80 శాతం కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. ఈ ప్రాంతంలోనే జిల్లా జలనిధి సోమశిల ఉన్నప్పటికీ సాగునీటి కేటాయింపులు లేవు. మేకపాటి బ్రదర్స్ ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి డెల్టాకు సమానంగా ఆయకట్టు స్థిరీకరణ చేయించారు. ఈ మార్పుతో మెట్ట ప్రాంతం ఆత్మకూరు సస్యశ్యామలం అయింది. రైతుల ఆర్థిక స్థితిగతులు మారాయి.

ఏకమైన ఆగర్భశత్రువులు

టీడీపీకి ప్రజాక్షేత్రంలో బలం లేకపోవడంతో ఆ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. టీడీపీని గట్టెక్కించేందుకు ఆగర్భశత్రువుల్లా ఉన్న మాజీ ఎమ్మెల్యేలు ఒక్కటై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై దండయాత్రకు సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని కృష్ణయ్య, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, అభ్యర్థిత్వ ఆశావహుడు గూటూరు కన్నబాబు పనిచేస్తున్నారు. కొమ్మి, కన్నబాబుకు ఘోర అవమానాలు జరిగినా తాయిలాలు ముందు అవన్నీ బలాదూర్‌గా మారాయి. ఈ బలం కూడా సరిపోదని వైఎస్సార్‌సీపీలోని ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలను భారీ ప్యాకేజీలతో సంతలో పశువుల్లా కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ పరిణామం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారింది. లక్షలాది రూపాయలు ప్యాకేజీలు తీసుకుని నాయకులు వెళ్లిపోయినా ప్రజలందరూ ఒక్కటవుతున్నారు. గతంలో టీడీపీ, జనసేన, బీజేపీకి స్థిరమైన ఓటు బ్యాంక్‌గా ఉన్న వారంతా స్వచ్ఛందంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వద్దకు వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

ఆనంకు రూ.26.26 కోట్ల ఆస్తులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఉమ్మడి కుటుంబ ఆస్తులు రూ.26.26 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆనం రామనారాయణరెడ్డి పేరుతో రూ.44.54 లక్షలు, ఆయన భార్య శిరీష పేరుతో రూ.32.84 లక్షల చరాస్తులతో పాటు ఆనం పేరుతో రూ.15.80 కోట్లు, సతీమణి పేరుతో రూ.9.70 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లుగా చూపారు. రూ.29.58 లక్షల అప్పులు ఉన్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించారన్న కారణంతో నెల్లూరులోని చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదై ఉన్నట్లు తెలిపారు.

కాకర్లకు అమెరికాలోనూ ఆస్తులు

టీడీపీ ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్ కుటుంబ ఆస్తుల విలువ రూ.27.44 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అందులో అతని పేరుతో రూ.15.14 కోట్లు, భార్య లక్ష్మీప్రవీణ పేరుతో రూ.12.30 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు ఉన్నట్లుగా చూపారు. ఇందులో వ్యవసాయేతర భూములతో పాటు అమెరికాలో ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే సురేష్‌కు రూ.3.28 కోట్ల అప్పు ఉంది. ఇటీవల ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ర్యాలీ చేశారన్న అభియోగంతో జలదంకి పోలీసు స్టేషన్‌లో ఒక కేసు ఉన్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన 5,6 సెమిస్టర్ పరీక్షలకు 8,409 మందికి, 7721 మంది హాజరయ్యారు. 688 మంది గైర్హాజరయ్యారు. నలుగురు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన నాల్గో సెమిస్టర్ పరీక్షలకు 8,834 మందికి, 8,337 మంది హాజరయ్యారు. 497 మంది గైర్హాజరయ్యారు. ముగ్గురు డిబార్ అయ్యారని ఆమె తెలిపారు.

పెత్తందారులకు ఓటుతో బుద్ధి చెప్పండి

వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి. పక్కన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: 'టీడీపీ నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పెత్తందారులకు ప్రతినిధులుగా పోటీ చేస్తున్నారు. అక్రమంగా సంపాదించిన సంపాదనతో ఓటర్లను కొనుగోలు చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు. వారికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెపాలి' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. మండలంలోని గంగపట్నంలో వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి తన మీద కేసులు ఉన్నాయని విమర్శించారని, తన మీద కేసులు ఉన్న మాట వాస్తవమేనన్నారు. ఆయనలా పదవులు అనుభవించి పార్టీకి వెన్నుపోటు పొడవలేదన్నారు. తాను వైఎస్సార్‌సీపీ నిజమైన కార్యకర్తనని, ఎల్లప్పుడూ జగన్‌తోనే ఉంటానన్నారు. చరిత్రలో వెన్నుపోటుదారుడిగా నిలిచిన చంద్రబాబుతో వేమిరెడ్డి జతకట్టారని దుయ్యబట్టారు. టీడీపీని చిత్తుచిత్తుగా ఓడించి కోవూరు సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రియతమ నాయకుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా తొలిసారి మీ ముందుకొచ్చిన తనను గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకుడైన ప్రసన్నకు మంత్రిగా అవకాశం ఉంటుందని, ఏడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గంగపట్నం పంచాయతీ పరిధిలో డీబీటీ ద్వారా రూ.25.24 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 12.87 కోట్లు లబ్ధి చేకూర్చామని వివరించారు. నాడు-నేడు కింద గంగపట్నం ఎంపీపీఎస్, జెడ్పీ హైస్కూల్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. వరదలతో దెబ్బతిన్న పల్లిపాళెం వంతెన స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మళ్లీ అధికారంలోకి వచ్చాక కొత్త వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విజయసాయిరెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి లేదన్నారు. నెల్లూరులో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బాహుబలి వంటి విజయసాయిరెడ్డిని జగన్‌మోహన్‌రెడ్డి రంగంలోకి దింపారని, విజయం మన వైపే ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను ఆపేస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా మైపాడుపాళెంలో టీడీపీకి చెందిన సుమారు 100 మంది ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నల్లపరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, మహేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి, ఫణీంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐదోరోజు నామినేషన్ల వెల్లువ

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఐదోరోజు మంగళవారం నామినేషన్లు వెల్లువెత్తాయి. జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాలకు 36 మంది అభ్యర్థులు 44 సెట్లు, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి ఐదుగురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. కందుకూరుకు ఏడుగురు అభ్యర్థులు 8 సెట్లు, కావలి నలుగురు అభ్యర్థులు 5 సెట్లు, ఆత్మకూరు నలుగురు అభ్యర్థులు 4 సెట్లు, కోవూరు ఇద్దరు అభ్యర్థులు 2 సెట్లు, నెల్లూరు సిటీ ఐదుగురు అభ్యర్థులు 5 సెట్లు, నెల్లూరు రూరల్ నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, సర్వేపల్లి ముగ్గురు అభ్యర్థులు మూడు సెట్లు, ఉదయగిరి ఏడుగురు అభ్యర్థులు 12 నామినేషన్లను దాఖలు చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రచారాన్ని అడ్డుకున్న టీడీపీ మూకలు

- సర్దిచెప్పబోయిన పోలీసులపైన దురుసుగా వ్యవహరించిన వైనం
- టీడీపీ నేతల తీరును ఖండించిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ ప్రచార రథాన్ని అడ్డుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు మండలం గుండెమడకలలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచార వాహనాన్ని టీడీపీ మూకలు అడ్డుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలు సర్దిజెప్పేందుకు ఎంత ప్రయత్నించినా ససేమిరా అనడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వాహనానికి వైఎస్సార్‌సీపీ నేతలు రక్షణ కవచంగా నిలబడి తప్పించే ప్రయత్నం చేశారు. అయినా వాహనాన్ని కదలనీయకపోవడంతో పరిస్థితి అదుపుతప్పే సమయంలో ఎస్సై కోటిరెడ్డి రంగప్రవేశం చేశారు. టీడీపీ కార్యకర్తలను అడ్డుతొలగించే ప్రయత్నం చేయగా ఎస్సైతో వారు దురుసుగా ప్రవర్తించారు. ఎంత సర్దిజెప్పాలని ప్రయత్నించినా వినకపోవడంతో ఒక దశలో ఎస్సై సహనం కోల్పోయారు. అనుమతితో ప్రచారం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ వాహనాన్ని అడ్డుకోవడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పట్టించుకోకుండా గొడవకు దిగడంతో అక్కడి నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వాహనాన్ని ముందుకు పంపించారు. దురుసుగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తలు, నేతలకు ఇది పద్ధతి కాదంటూ వార్నింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపించి సమస్యను సద్దుమణిగింపజేశారు.

వివాదానికి టీడీపీ వ్యూహాత్మక ప్లాన్

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రం గుండెమడకలలో జరుగుతుందని ఆ పార్టీ ముందుగానే ప్రకటించింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు గ్రామ నడిబొడ్డున వైఎస్సార్‌సీపీ ప్రచారం జరిగే సమయంలోనే వారు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సెంటర్‌లోనే టీడీపీ కార్యకర్తలకు టిఫిన్ ఏర్పాటు చేశారు. ప్రచారం రథంపై నుంచి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రసంగిస్తుండగా కొందరు టీడీపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముందస్తు వ్యూహంలో భాగంగానే వివాదాన్ని రాజేశారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం కావడంతో ఓర్వలేక టీడీపీ ప్లాన్ ప్రకారం గ్రామాల్లో వివాదాలకు పురిగొల్పుతోందని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. ఇలాంటి దుశ్చర్యలు సరైనవి కావని ఖండించారు.


నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి


వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి


సీతారామపురం మండలంలో జగన్ పథకాలను తిలకిస్తున్న ప్రజలు


టైలరింగ్ చేస్తున్న నేహారెడ్డి

జనం కోసం..

ఎన్నికలు సమీపిస్తుండడంతో అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాలు, ప్రచారాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి మంగళవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా తన క్యాంప్ కార్యాలయంలో పత్రాలపై సంతకాలు చేశారు. కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కోవూరు అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్ రెడ్డి విడవలూరు మండలంలో ప్రచారం చేశారు. సీతారామపురం మండలంలోని గ్రామాల్లో ఎల్‌ఈడీ ప్రచార రథాలు తిరిగాయి. విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె నేహారెడ్డి నెల్లూరు నగరంలో ప్రచారం చేశారు. మహిళలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/విడవలూరు/సీతారామపురం

ప్రచార పర్వం

బాబొస్తే జన్మభూమి కమిటీలదే రాజ్యం


పుంజులూరుపాడులో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

వెంకటాచలం: 'టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు రాజ్యమేలుతాయి. చంద్రబాబును నమ్మి మోసపోవద్దు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిక్కవరప్పాడు, పుంజులూరుపాడు, గుడ్లూరువారి పాళెం, తిరుమలమ్మపాళెం గ్రామాల్లో మంగళ వారం మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో చంద్రబాబు లాంటి మోసగాడు, నయవంచకుడు ఎవరూ లేరనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో రైతులు, పొదుపు మహిళలకు రుణాలు మాఫీ చేస్తానని ఎలా మోసం చేశాడో ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. మీ కుటుంబాలకు లబ్ధి చేకూరిందని నమ్మితేనే ఓటు వేయాలని కోరుతున్న సీఎం దేశ చరిత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని స్పష్టం చేశారు. జగనన్న పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నా, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో మంత్రిగా ఉన్నా నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలియజేశారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య తేడాను గమనించి రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, యువజన విభాగం మండల కన్వీనర్ ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, రౌతు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నాడు – నేడుతో మారిన బడుల రూపురేఖలు


ప్రచారం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల

నెల్లూరు సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నాడు – నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని కొండ్లపూడి గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్లో రౌడీయిజం, దౌర్జన్యాలు, అరాచకాలు లేకుండా చేశానని తెలిపారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణమే తన లక్ష్యమన్నారు. ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, కోటేశ్వరరెడ్డి, స్వర్ణా వెంకయ్య, మల్లు సుధాకర్‌రెడ్డి, ఒట్టూరు సుధాకర్ యాదవ్, సర్పంచ్ సుజాత, ఎంపీపీ బూడిద విజయకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి గుణపాఠం చెప్పడం ఖాయం


ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్

- కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్

కందుకూరు: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని వైఎస్సార్‌సీపీ కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక 14వ వార్డులోని షాదీఖానా ప్రాంతం, శ్రీరామకాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు పెద్దఎత్తున మేలు చేసిందన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందించిందని గుర్తు చేశారు. పేద పిల్లల కోసం ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీకి వస్తున్న ప్రజాదరణను చూడలేకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. స్థానిక గ్రామ దేవత పోలేరమ్మ తల్లి ఆలయంలో బుర్రా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ రఫీ, సచివాలయ కన్వీనర్లు సాదు మాధవ, షేక్ మహబూబ్‌బాషా, వెలిచర్ల రమాదేవి, దేవరకొండ ఆదిలక్ష్మి, నాయ కులు మోసంగి వెంకటస్వామి, గణేశం గంగిరెడ్డి, రేణమాల అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మరో సెట్ నామినేషన్

మధుసూదన్ యాదవ్ బుధవారం మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు పామూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి పామూరు రోడ్డు జంక్షన్, ఏరియా హాస్పిటల్, అంకమ్మ తల్లి దేవాలయం, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఆయన చేరుకోనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఈ సందర్భంగా బుర్రా పిలుపునిచ్చారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మేలు

- అల్లూరు మండలంలో రామిరెడ్డి ప్రచారం
- హాజరైన బీద మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగింది. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలి' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అల్లూరు మండల పరిధిలోని నార్త్ మోపూర్, గ్రద్దగుంట, బట్రకాగోళ్లు, నార్త్ ఆములూరు గ్రామాల్లో మంగళవారం వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను ప్రారంభించి ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకే తీసుకొచ్చారన్నారు. 2014లో చంద్రబాబు అనేక హామీలిచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఈసారి కూడా అబద్ధపు హామీలు గుప్పిస్తున్నాడని, ఎవరూ నమ్మొద్దన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో చంద్రబాబు ప్రజలకు ఏమి చేయకుండా జన్మభూమి కమిటీలతో ఇబ్బంది పెట్టారన్నారు. అవినీతికి పాల్పడి ప్రజా ధనాన్ని దోచుకున్నాడన్నారు. కార్యక్రమంలో కందుకూరు అసెంబ్లీ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, అల్లూరు టౌన్, రూరల్ కన్వీనర్లు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్‌బాబు, నాయకులు నీలం సాయికుమార్, బాలకృష్ణరాజు, మధురెడ్డి, దాసరి మల్లి, దాసరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి

ఆశీర్వదించండి.. మీలో ఒకడిగా ఉంటా


ప్రచారం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): 'ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నన్ను గెలిపించండి. మీలో ఒకడిగా ఉంటూ సమస్యలను పరిష్కరిస్తా' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండెమడకల, నల్లగొండ్ల, చౌటపల్లి, శంఖవరం, వెంకటాద్రిపాళెంలో మంగళవారం విజయ సంకల్పయాత్రను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఎనలేని మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎల్లో గ్యాంగ్ అడ్డదారులు తొక్కి విజయం సాధించాలని చూస్తోందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రజలు రాజగోపాల్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గణపం బాలకృష్ణారెడ్డి, మోది రామాంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, పి.కొండారెడ్డి, జి.రమణారెడ్డి, కొంకల వెంకటేశ్వరరెడ్డి, గణపం రమేష్‌రెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమశిల వద్ద కొండపై మంటలు

సోమశిల: సోమశిల జలాశయం వెనుక భాగంలో ఉన్న కొండపై మంగళవారం మంటలు చెలరేగాయి. ఇది ఆకతాయిల పనిగా అటవీ శాఖ అధికారులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆటోనగర్‌లో యువకుడి దారుణ హత్య

- విచక్షణారహితంగా కత్తులతో నరికిన వైనం


దశరథ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షలో.. మద్యం మత్తులో నెలకొన్న విభేదాలో.. వివాహేతర సంబంధమో.. మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదుగానీ ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బీవీ నగర్ రైల్వేగేటు సమీపంలోని వినాయకస్వామి గుడి వీధిలో పి.రామయ్య, నాగమణి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి దశరథ (28), మేఘనాథ్‌లు సంతానం. మేఘనాథ్‌కు వివాహమై వేరుగా జీవిస్తుండగా దశరథకు పెళ్లి కాలేదు. తల్లిదండ్రులతో ఉంటున్నాడు. అతను పదోతరగతి వరకు చదువుకున్నాడు. కొంతకాలం బీవీ నగర్‌లోని ఓ హోటల్లో సూపర్‌వైజర్‌గా పనిచేశాడు. తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ షాపులో పనిచేశాడు. ఏడాదిన్నరగా పనిమానేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల తన తాతతో కలిసి పుచ్చకాయల వ్యాపారం చేయసాగాడు. సోమవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పని ఉందని ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు.

పోలీసులకు సమాచారం

మంగళవారం ఉదయం ఆటోనగర్ పడమరవైపు ఖాళీ స్థలాల్లో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈక్రమంలోనే బీవీ నగర్‌కు చెందిన కృష్ణ అటుగా వెళ్తూ మృతుడిని దశరథగా గుర్తించి బాధిత తల్లి నాగమణికి సమాచారం అందించారు. ఆమె ఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి కన్నీటి పర్యంతమైంది. తన కుమారుడిని హత్య చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. గుర్తుతెలియని దుండగులు దశరథ కాళ్ల మడమలు, చేతి మణికట్టును నరకడంతోపాటు గుండెల్లో కత్తితో విచక్షణారహితంగా పొడిచారు. కత్తి అందులోనే ఇరుక్కుపోయింది. జీజీహెచ్ వైద్యులు పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు దారి తీసిన పరిస్థితులు, నిందితులను పట్టుకునేందుకు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. ఘటనా స్థలంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)
పెద్దవి : రూ.78
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 123	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ (లైవ్)	: 93		
బ్రాయిలర్ చికెన్	: 220	లేయర్ చికెన్	: 158

